# నిక్షేపంలాంటి చుట్ట

మఱ్ఱిచెట్టు కింద నీడ తొంగున్నాది. ఆకులు అలల్లా గలగలలాడుతున్నాయి. ముసిల్దీ, మరో బొట్టీ ఒక తట్టా, ఒక బుట్టా పెట్టుకుని బస్సు కోసం నుంచున్నారు. పొద్దుటినించీ నుంచున్నారు. ఏ బస్సూ ఆగలేదు, ఒక బస్సు ఆగింది కానీ, డబ్బు లెక్కువడిగేరు. " ఓలమ్మ - ఎక్కణ్ణిం చొట్టు కొద్దనూ-'' అని సాగదీసించి ముసిల్ది. కిసుక్కున నవ్వింది బొట్టి. ఆ బొట్టికి పదమూడు పధ్నాలుగేళ్లుంటాయి. దానికి గత ఏడాదే పెళ్లయింది. మొగుడు పట్నంలో బిళ్లబంట్రోతు ఉద్యోగం చేస్తున్నాడు. ఇంకా గర్భాదానం చెయ్యలేదు. ఆ బొట్టి మెళ్లో నల్లపూసలూ, మంగళసూత్రమూ ఉన్నాయి. ఆ ముసిల్ది బొట్టికి నానమ్మవుతుంది. దాని కొక డెబ్బయ్యేళ్లుంటాయి, మనిషి గసికినాగుంది. అల్లంత దూరాన బస్సు కనపడ్డాది.

"మామ్మా, అల్లదిగోటి ఎఱ్ఱబస్సు" అన్నది బొట్టి సంబరపడుతూనూ, సంభ్రమపడుతూనూ.

"టిప్పులు బండిగావునే" అంది ముసిల్ది. నోట్లో చుట్ట వాటంగా పళ్లమధ్య బిగించి. ఆ చుట్ట ఎంత లేదన్నా ఆరంగుళాలుంటుంది. ఆ చుట్ట కాల్చడంలో ముసిల్ది లీనమయిపోయింది.

దుమ్ము రేపుకుంటూ టిప్పుల బండి వచ్చింది. ఆ గుంట రోడ్డుమీదికి వెళ్లి చెయ్యి అడ్డుపెట్టి " ఆపాల, ఆపాల'' అని కేకలేసింది.

బస్సు ఆగింది, అల్లంత దూరం పోయి. మఱ్ఱి చెట్టుపక్క టీ దుకాణంలో కూచున్నమరో ఇద్దరు ప్రయాణీకులూ బయిటికి వచ్చేరు.

" రావాల, రావాల, టయిములేదు" అన్నాడు, చెక్కరుకుఱ్ఱాడు, వాడు ముసిల్దాని పక్కనున్న బొట్టిని చూశాడు, ' బాగుంది గుంట' అనీ అనుకున్నాడు.

టీ దుకాణాంలోనించి వచ్చిన ప్రయాణీకులిద్దరూ బస్సెక్కిపోయారు. ముసిల్ది తట్ట ఎత్తుకోబోయింది. బొట్టి బుట్ట పట్టుకుంది.

" ఏటా తట్టలోయీ? " అన్నాడు చెక్కరు. " మరేట్నేదూ, ఎండిసేపలూ" అంది ముసిల్ది నోట్లో చుట్ట ఉంచుకునే.

" సెస్, అలాగయితొద్దు, రైట్, రైట్" అనేశాడు విసురుగా. బస్సు బఱ్ఱుమనుకుంటూ కదలబోయింది. " బాబ్బాబూ, నీ కాళ్లట్టుకుంటాన్నాయనా, ముసిలిముండని, నన్ను ఎక్కించీ, బాబూ, నీకో మాంచి ఎండిసే పిత్తాన్నాయనా" అంటూ అరిచింది ముసిల్ది, ఆ అరుపులో దాని నోట్లో ఉన్న కావిడిబద్దలాటి చుట్ట నేల రాలింది.

ఎండిచే పిత్తానన్న మాట చెవిన పడేసరికి చెక్కరు "స్స . . . . ఆపాల, ఆపాల" అన్నాడు. ఆగింది బస్సు.

ముసిల్ది నింపాదిగా తట్ట పట్టుకుని ఎక్కింది. " సోట్నేదు, కిందే కూకోవాల" అన్నాడు కండక్టరు, " పోనలాగే, బాబూ, ఎలాగో లాక్కుపో'' అంది ముసిల్ది.

ఆ పైన బొట్టి బస్సులోకి వచ్చింది. తట్ట అందుకున్నాడు చెక్కరు కుఱ్ఱాడు.

వెనక సీట్లో కాస్త చోటు చేశాడు, ఆ పిల్లని కూచుండబెట్టాడు.

" డబ్బులు, డబ్బులు " అన్నాడు కండక్టరు. " రైట్, రైట్ " అన్నాడు చెక్కరు తలుపు ఠణాయించి కొట్టి.

బస్సు కదిలింది.

మళ్లీ అంతలోనే ఆగిపోయింది. మర్రిచెట్టు పక్కనున్న టీ దుకాణంలోనించి ఒక నడివయసు ఆడమనిషి బయటికి వచ్చింది ఒక్క పరుగున.

" ఓరి మీయమ్మ కడుపులుకాల " అని లంకించుకుంది ఆ వెంటనే,

" ఏటయ్యింది, ఏటయ్యింది?" అనుకుంటూ కండక్టరు దిగేడు. ఆ వెనక చెక్కరూ దిగేడు.

" ఏటయ్యింది, ఏటయ్యింది?" అని బస్సులోని జనాలుగుంపుసింపు పడ్డారు.

" నిచ్చేపంలాటి పెట్ట, పొట్ట నెట్టేసుకున్నాడు " అన్నది టీ దుకాణపు నడివయసుదాయి . "బస్సు కదుపు సెబుతాను. నీ మీద కేసెడతాను. తాగేసి ఎక్కినావేటి బస్సూ?" అని ఒకటే వరస చెరిగి పోసేస్తూంది.

డ్రైవరుకు ఏమీ పాలుపోవడం లేదు. "ఏటీ ఇదవచొద" అని విసుక్కుంటున్నాడు.

జనం దిగేరు. చుట్టలూ, బీడీలూ, సిగరెట్లూ ముట్టించేరు.

"థూత్, ఎదవబస్సు, ఈ పాటకి నడిసినా మవూరుపోదుం" అన్నా డో నాయుడు.

కండక్టరు బతిమాలుతూన్నాడు, రెండ్రూపాయలనోటు చేతిలో పెట్టి, " ఏదో పొరపాటయిపోయింది, ఇది కర్చుకుంచు-మరేటనకు" అంటున్నాడు కండక్టరు.

"మొకం సూడెలాంగుదో, నాలిముచ్చు, పెట్ట సచ్చినే నేడుత్తంటే రెండ్రూపాయలు సేతు లెడతావా? పది రూపాయల పెట్ట, ఒకట్రకం పెట్ట-" అని నిప్పులు చెరిగేస్తూంది.

ఇంతలో ఓ జట్కా ఆగింది ఈ చోద్యానికి. కండక్టరుకి ఇంతట్లో ఇది వదిలేలా కనపడలేదు. "టయముదాటిపోనాది, బేకినస్పెట్ట రొచ్చినాడంటే యాబయి రూపాయి లొదిలిపోతాయి. ఆ మీద ప్రొప్పరయిటరు తిడతాడు " అని చెక్కరు చిందులు తొక్కుతున్నాడు.

అయిదు రూపాయల నోటు తీశాడు. " ఇంద, ఇంకెందు గ్గొడవ " అన్నాడు,

" నాబం నేదు - పదీ ఇచ్చావా సరి. నేదా, నీ బస్సెలా కదులుద్దో నేనూ సూత్తాను" అని లంకించుకుంది.

'చస్ - ఎదవగొడబ ' అనిపించింది కండక్టరుకి, కష్టపడి, కొన్ని టిక్కట్లు రాయకుండా అయిదు రూపాయలు మిగిలించేడు. ఆ అయిదూ పోయాయి.

డ్రైవరు గమ్మునుండిపోయాడు. 'నేను పొద్దున్న బయల్దేరుతుంటే, ఎవరి ముకం సూశానో' అనుకున్నాడు వినిపించీ వినిపించనట్టు. అతగానికి పట్టింపు లెక్కువ.

" ఏటో, ఎదవతగువు !" అనుకుంది లోపలున్న ముసిల్ది. దాని కిది నచ్చలేదు. బొట్టి అయోమయంగా చూస్తున్నది.

" పారీదూ, ఎదవ సొద, బేకినస్పెట్ట రొచ్చినాడా అంటే కొంప మునుగుద్ది – ఓవర్ నోడు, పైగా టయిమూ దాటిపోనాది–" అని సర్దుతున్నాడు చెక్కరు.

"సెస్– నువ్వెండేస్ " అని గసిరీశాడు కండక్టరు. మొత్తానికి టీ దుకాణంది ఒప్పుకోలేదు.

ఆగిన జట్కావాడుకూడా "పారీండి, బాబూ, దాంతో జట్టీయేల?" అని న్యాయం చెప్పేడు.

"ఇక తప్పదురా నాయనా," అనుకున్నాడు కండక్టరు. "తను మిగుల్చుకున్న అయిదూ కాక, మరో అయిదూకూడా నష్ట పోవాలి." ప్రాణం ఉసూరుమనిపించింది.

"పోనీ, పదీ పుచ్చుకో! అ పెట్టిచ్చీ" అన్నాడు కండక్టరు. కాని ఇస్తుందన్న ఆశలేదు.

" నానియ్యను, మట్టించేసీ, పైగా ఇదేటి నాకు డబ్బొద్దు, కేసెడతాను, సూసుకుందాం" అన్నది టీ దుకాణంది,

పట్టిందే పట్టుగా.

" అన్న, కొంప మునుగుద్దే. అసలే రోజులు బాగులేవు కూడానూ " అనుకున్నాడు కండక్టరు.

" ఇచ్చెయ్యవలిసిందే– పది రూపాయలూ సంకనాకిపోయినట్టే, ఛన్–ఛన్'' అని బాధపడిపోతున్నాడు కండక్టరు. పది రూపాయలు మరి ఉత్తపుణ్యానికిచ్చుకుంటున్నాడు.

పది రూపాయల నోటు కష్టంగా పైకి తీశాడు. " తేతే, ఎందుకొచ్చిన జట్టీ " అని నోటు ఇట్టే లాక్కుని పారిపోయింది టీ దుకాణంది.

దాని కొడుకు వచ్చి, దెబ్బతిన్న కోణ్ణి పట్టుకుపోయాడు. తన ఆస్తి అంతా పోయినంత బాధనిపించింది కండక్టరుకి. " ఎక్కెక్కుక్కశానగాని " అన్నాడు చెక్కరు.

ఎదురుగా మరో బస్సు వచ్చింది.

అది ఆగింది.

" ఏటి తగువు? ఎదర బేకినస్పెట్టరున్నాడు మరి, జాగ్రత్త" అని అరిచేడు అవతలి బస్సులోంచి కండక్టరు, ఆ బస్సు కదిలింది.

" ఎక్కెక్కు'' అని కండక్టరూ, చెక్కరూ బస్సెక్కేరు. బస్సు బర్రుమంటూ కదిలింది.

" గండం గడిచింది " అనుకున్నాడు డ్రైవరు మనసులోనే.

" ఆ నాయాల దిగేడుకాదు, చూశావా!" అన్నాడు కండక్టరు, డ్రైవరు మీద కండక్టరుకి వల్లమాలిన దుఃఖంగా ఉంది. 'రే పాడి కియ్యవలిసిన వాటాలో కన్నమెడతాను' అనుకున్నాడు. " పోనొల్లకోన్" అన్నాడు చెక్కరు కుర్రాడు.

బస్సు పరుగెడుతూంటే గాలి చల్లగా తగులుతూంది.

"డబ్బు డబ్బు " అన్నాడు కండక్టరు.

రూపాయినోటు రొంటినున్న చిక్కంలోంచి తీసి ఇచ్చింది. అది బాగా నలిగిపోయింది.

" ఎక్కడికేటి?" అన్నాడు కండక్టరు.

" కొతారుబిల్లి చంతకి " అన్నది ముసిల్ది.

చెక్కరు కుర్రాడు ఆ బొట్టికి ఆనుకుని కూచున్నాడు. ఆ బొట్టి ఇంకా ముడుచుకుంటున్నది. ఆ డింకా సరకాయిస్తున్నాడు.

"ఇంకో రూపాయి తే " అన్నాడు కండక్టరు.

" ఎందుకూ " అన్నది ముసిల్ది.

" ఎందుకేటి? కాళీ లేదు, దిగిపో లేపోతే " అన్నాడు కండక్టరు.

"ఇందా, ఈ అరుదురూపా యుంచు " అంది ముసిల్ది. కండక్టరు పోన్లే అని ఊరుకున్నాడు.

బస్సు ఝూమంటూ పరుగెడుతుంది.

' ఛీ ఛీ, చేపల కంపు ' అనుకున్నాడు పక్కనున్న నాయుడు, ముక్కు మూసుకున్నాడు.

" ఏమిటీ – బేడ్‌స్మెల్ " అంటూ లేచాడు ఎదర సీట్లో కూచున్న స్టూడెంటు.

'వెరీ డర్టీ– నాన్సెన్స్ – ఈ బసెస్ వాళ్లకి సెన్సుండదు' అనుకుని సెంటురాసిన జేబురుమాలు ముక్కుదగ్గిర పెట్టుకున్నాడు.

" నరవ – నరవ. దిగాల జోరుగా " అన్నాడు చెక్కరు.

ఒక ముసలివాడు దిగి, మరో ఇద్దరు పడుచువాళ్లు ఎక్కేరు.

బస్సు మళ్లీ కదిలింది.

" అన్నా నా సుట్ట " అని తడుముకుంది ముసిల్ది.

' నిచ్చేపంనాటి సుట్ట రాలిపోనాది – నాను కానుకోనేదు, ఈ గొడబనోను–' అనుకుని నొచ్చుకుంది. దానికి ప్రాణం కష్టం తోచింది. బేడెట్టి కొన్న పొగాకు కాడతో మహవాటంగా చుట్టుకున్న చుట్ట నిష్కారణంగా పోయింది.

" నా కెండిసేపిత్తానన్నావ్ " అని జ్ఞాపకం చేశాడు చెక్కరు.

"ఎండి సేపా లేదు ఏటీ నేదు. నా సుట్ట పడిపోనాది " అని చిరాకు పడిపోయింది ముసిల్ది.

బస్సు కొతారుబిల్లిలో ఆగింది.

ముసిల్ది, బొట్టీ దిగిపోయారు.

" నిచ్చేపంనాటి సుట్ట పోనాది " అని నొచ్చుకుంది ముసిల్ది. ముసిల్దాని గొణుగుడుకి బొట్టి కిసుక్కున నవ్వుకుంది, నోటికి చెయ్యి అడ్డం పెట్టుకుని.

రచనకాలం : ఆగస్టు 1969

ప్రచురణ : ఆంధ్రప్రభ - సచిత్రవారపత్రిక, 25-3-1970.